
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 మార్చి 2024

5

తిరుపతి





ఎస్‌బిఐ దోషిగా నిలబడాల్సి ఉంటుందంటున్న వి.నాగరాజు

# 'పేట'లో ఇంటర్ 'మాస్ కాపీయింగ్'



**నిబంధనలు తుంగలో తొక్కిన విద్యాశాఖ**
**'శ్రీవేమ'లో లెక్చరరే డిపార్టుమెంట్ ఆఫీసర్**
**పరీక్షా కేంద్రం కేటాయింపుల్లోనే అక్రమాలు**

> నాయుడుపేట 'శ్రీవేమ' ఇంటర్ పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జోరుగా జరుగుతున్నట్లు విద్యార్థులే ఆరోపిస్తున్నారు. జిరాక్స్ చిట్టీలు అందిస్తూ కాలేజీ లెక్చరరే డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ ఈ మాస్ కాపీయింగ్‌కు తెరదీసినట్లు తెలుస్తోంది. విషయాన్ని ఆర్‌ఐఒ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో లక్షల్లో చేతులు మారడం వల్లనే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కష్టపడి చదివిన విద్యార్థుల తల్లిదండ్రులు మాస్ కాపీయింగ్‌పై మండిపడుతున్నారు.

**ప్రజాశక్తి - నాయుడుపేట**

నాయుడుపేట ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, సూళ్లూరుపేట విద్యార్థులను నాయుడుపేటలోని శ్రీ వేమా జూనియర్ కాలేజీ ప్రైవేట్ పరీక్షా కేంద్రంలో వేశారు. డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌ను పథకం ప్రకారం వేసుకుని మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ విషయమై తిరుపతి ఆర్‌ఐఒను శనివారం వివరణ కోరగా పరీక్షా కేంద్రంలో విధుల కేటాయింపులు, అవకతవకలు వాస్తవమేనని, నిబంధనల ప్రకారం కళాశాల విద్యార్థులు పరీక్ష రాసే చోట అదే (నాయుడుపేట గవర్నమెంట్ కళాశాల) లెక్చరర్లు అధికారులుగా వేయకూడదని తెలిపారు. సదరు అధికారులను వెంటనే పరీక్షా కేంద్రం నుంచి రిలీవ్ చేస్తామని చెప్పారు. అయినా సోమవారం జరిగిన పరీక్షకూ యధావిధిగా సదరు సిబ్బంది విద్యార్థులతో మాస్ కాపియింగ్ యథాతథంగా చేయించడం గమనార్హం. ఈ మాస్ కాపీయింగ్ వెనుక తిరుపతి ఆర్‌ఐఒ హస్తం ఉందని, సూళ్లూరుపేట విద్యార్థులకు పేట పరీక్షా కేంద్రం ఎలా కేటాయిస్తారని, కావాలనే నాయుడుపేట ప్రైవేట్ కేంద్రాన్ని కేటాయించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పరీక్షా కేంద్రాల కేటాయింపుల్లోనే అధికారులు చేతివాటం చూపారని తెలుస్తోంది. నాయుడుపేట పట్టణంలో ఇంటర్ పరీక్షల్లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చక్రం తిప్పడంతో పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోంది. దీంతో ప్రతిరోజూ సాయంత్రం జిరాక్స్ కేంద్రాల వద్ద మైక్రో జిరాక్స్‌ల కోసం గుంపులు గుంపులుగా విద్యార్థులు దర్శనమిస్తున్నారు. నాయుడుపేటలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ప్రహసనంగా మారిపోయింది. దీంతో కష్టపడి చదివిన విద్యార్థులకు శాపంగా మారిందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇకనైనా వేమ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ అధికారులను, ఇన్విజిలేటర్లను మార్పు చేసి వారి స్థానంలో వేరే అధికారులను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

## ఎస్‌బిఐ ఎదుట సిపిఎం ధర్నా

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇచ్చిన ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌ఐబి బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ధర్నా నిర్వహించింది. నిమిషాల్లో అయ్యే పనికి 116 రోజులు సమయం కావాలని ఎస్‌బిఐ కోరడం మోడీ కుట్రలో భాగమేనని మండిపడింది. పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్‌బిఐ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన ధర్నా ఉద్దేశించి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల బాండ్లతో బిజెపి దగ్గర కోట్ల డబ్బులు పోగుపడి ఉన్నాయని, రానున్న ఎన్నికల్లో డబ్బులు వెదజల్లి మరోసారి ప్రజలను మోసం చేసి నెగ్గాలని చూస్తోందన్నారు. సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించినా, వివరాలు వెల్లడించడానికి ఎస్‌బిఐ మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. 2014-2019 మధ్యకాలంలో బిజెపికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 45 శాతం నిధులు వచ్చాయన్నారు. పదేళ్లలో 90శాతం ఎన్నికల బాండ్లు బిజెపికి వచ్చాయన్నారు. సుప్రీంకోర్టు అడిగినా బయట పెట్టడం లేదంటే ఎస్‌బిఐ బోన్‌లో నిలబడాల్సి వస్తుందన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో 350 నుండి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తామని బిజెపి నేతలు అనడం అంటే రాజ్యాంగ పీఠికలో ఉన్న సెక్యులరిజం అనే పదాన్ని ఎత్తివేయడానికి పూర్తి మెజారిటీ అడుగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే వేణుగోపాల్, ఎన్ మాధవ్, పి చిన్న, ఏ రాధాకష్ణ, పార్థసారధి రెడ్డి, సిద్దు, రవి, అక్బర్, వెంకటేష్,బాల, శ్రీరాములు, రమణ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..** ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి ముందు సిపిఎం పట్టణ కార్యదర్శి గంధం మణి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సుప్రీం ఆదేశాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. నగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, సంక్రాంతి వెంకటయ్య, గురునాథం తదితరులు పాల్గొన్నారు.



## సాంఘిక సంక్షేమ హాస్టళ్ల గోడు పట్టదా? : ఎస్‌ఎఫ్‌ఐ

**ప్రజాశక్తి - క్యాంపస్**

తిరుపతి జిల్లాలో దాదాపుగా 130 పైగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, పదివేల మంది విద్యార్థులు వీటిల్లో ఉంటూ చదువు కొనసాగిస్తున్నారని, అయితే నాలుగు నెలలుగా మెస్సు బిల్లులు రాక వార్డెన్లు అవస్థలు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, అధ్యక్షులు అక్బర్ తెలిపారు. సోమవారం 'స్పందన' కార్యక్రమంలో భాగంగా జేసీకి వినతిపత్రం సమర్పించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పట్టించుకోవాలని విన్నవించారు. నాలుగు నెలలుగా మెస్సు బిల్లుల బకాయిలు ఉంటే పిల్లలు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. విద్యార్థులకు పౌష్టికాహారం ఏ విధంగా అందిస్తారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు తేజ, శివ, నగర నాయకులు శ్రీనివాసులు, బాల, హర్షద్, గణేష్ పాల్గొన్నారు.



## ఈవీఎం గోడౌన్ల వద్ద 24X7 నిఘా : కలెక్టర్

**ప్రజాశక్తి - రేణిగుంట**

జిల్లాకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాము వద్ద 24×7 నిరంతరం పటిష్టమైన నిఘా, భద్రత యధావిధిగా కొనసాగాలని, పీ.ఓ, ఎపీఓ ల శిక్షణ కొరకు వినియోగించనున్న డెమో ఈవిఎం లను అత్యంత భద్రత నడుమ సంబంధిత రెవెన్యూ డివిజన్లకు తీసుకెళ్లాలని కలెక్టర్ జి.లక్ష్మీ శ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్‌హౌసింగ్ గోడౌన్‌లో భద్రపరచిన ఈవిఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ ఇన్‌ఛార్జి కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ పిఒ, ఎపిఒల శిక్షణ నిమిత్తం గతంలో రెవెన్యూ డివిజన్లకు 46 ఇచ్చామని తెలిపారు. సిఇఒ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి 20 చొప్పున గతంలో ఇచ్చినవి పోను 94 ఇవిఎంలను నాలుగు రెవెన్యూ డివిజన్లకు భద్రత నడుమ పంపనున్నట్లు తెలిపారు. అధికారులు చంద్రశేఖర్, పవన్, టిడిపి మనోహరాచారి, వైఎస్ఆర్ కాంగ్రెస్ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ చిరంజీవి పాల్గొన్నారు.

## ఎస్‌విఎంసి, రుయాను సందర్శించిన వైద్య విద్య సంచాలకులు

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

ఎస్ వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి ని డైరెక్టర్ ఆఫ్ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ స్వాగతం పలికారు. ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో , చెవి ముక్కు, నాలుక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వినకడి దినం ముగింపు సమావేశాలు సందర్భంగా ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. వినికిడి సామగ్రిలు అవగాహన కొరకు మొట్టమొదటిసారిగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. డాక్టర్ నరసింహన్ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం సామాజిక వైద్య వైద్య విభాగంలో ఆగస్టు నెలలో జరగబోవు ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, ఇండియన్ సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్, వారి మూడు రోజుల కాన్ఫరెన్స్ బ్రోచర్ను ఆవిష్కరించారు. ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## టూరిజం ట్రావెల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ వారి ఇండియన్ ఇన్స్ టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ లో ఎంబీఏ, బిబిఏ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి నరేష్ తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యంత ఆధునాతన సాంకేతిక ప్రమాణాలతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ టీచర్లచే విద్యాబోధన అందిస్తూ అభ్యర్థుల అభ్యున్నతికి కషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా 2024-25 సంవత్సరానికి గాను టూరిజం ట్రావెల్ మేనేజ్మెంట్ లోని ఎంబీఏ, బీబీఏ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాలు కాల పరిమితి కలిగిన ఎంబీఏ, కోర్సుకు ఏదేనీ డిగ్రీ అర్హతతో పాటు 50 శాతం మార్కులు సాధించాలని, ఎస్సీ ఎస్టీలకు 40 శాతం మార్కులున్నా అర్హులన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితి గల బీబీఏ కోర్సుకు ఇంటర్మీడియట్లో 50 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 40 శాతం మార్కులుంటే అర్హులన్నారు. కోర్సులలో అభ్యర్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ సౌకర్యం ఉంటుందని, తెల్ల రేషన్ కార్డు కలిగి 2.5 లక్షల ఆదాయం ఉన్నవారు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి జవహర్లాల్ యూనివర్సిటీ డిగ్రీ ప్రదానం చేస్తుందన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలను వెబ్సైట్ ను సందర్శించి జూన్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 9966462786, 9490787854 లను సంప్రదించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అభిలాష్ పాల్గొన్నారు.

# బాలుని కిడ్నాప్ కథ సుఖాంతం

**తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్‌పి**



**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

తిరుమలలో ఆదివారం కిడ్నాప్‌కు గురైన బాలుడు అభినయ్ (3) కేసును పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించి బాలుని తల్లిదండ్రులకు అప్పగించి శభాష్ అనిపించుకున్నారు. ఈ ఘటన సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కష్ణ కాంత్ పటేల్ సోమవారం మీడియాకు వివరించారు. స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం గద్వాల జిల్లా నుంచి శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులు 10 మంది కలసి తిరుమలకు కాలినడకన ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్నారు. మగవారు రూముల రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా, ఆడవారు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని మహిళ పిల్లవానికి సెల్‌ఫోన్ ఇచ్చి ఏమార్చి కిడ్నాప్ చేసింది. ఎస్‌పి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సిసిటివి ఫుటేజీలను పరిశీలించగా తిరుపతి పెద్దకాపు లేఔట్‌లోని ఓ లాడ్జిలో బాలునితో ఉన్నట్లు గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. బాలుని తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలు లేకపోవడం వల్ల బాలుని అపహరించినట్లు నిందితురాలు పేర్కొంది. నిందితురాలు రాజమండ్రివాసిగా గుర్తించారు. బాలున్ని పట్టుకునేందుకు విశేష కృషి చేసిన సిఐలు జగన్ మోహన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రిపీటర్, బ్లూ-కోల్ట్స్, రక్షక్ స్టాఫ్ వారిని, సమాచారం ఇచ్చిన ఉద్యోగి అవుల ప్రభాకర్ యాదవ్‌ను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

# స్విమ్స్‌లో 479 నర్సు పోస్టుల భర్తీ

**టిటిడి పాలకమండలి నిర్ణయాలు**



**ప్రజాశక్తి - తిరుమల**

స్విమ్స్ ఆస్పత్రిలో 479 నర్సు పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. టిటిడిలోని అన్ని కళాశాలల్లో సిఫార్సు లేకుండానే విద్యార్థులకు హాస్టల్ వసతి కోసం అదనంగా భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. 2014కు ముందు టిటిడిలో నియమించిన కాంట్రాక్టు పొరుగు సేవా సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. యాత్రా సముదాయంలో లిఫ్ట్‌ల ఏర్పాటుకు 1.88 కోట్లు కేటాయించారు. బాలాజీనగర్ సమీపంలో ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయించారు. 14 కోట్లతో టిటిడిలోని 188 క్వార్టర్స్ ఆధునీకరణ చేయనున్నారు. గోవిందరాజస్వామి ఆలయంలో బాష్యకార్ల సన్నిధిలో మకర తోరణం బంగారు తాపడానికి ఆమోదించారు. ఐటి సేవల కోసం రూ.12 కోట్లు కేటాయించారు. శ్రీవాని ట్రస్టు నిధులతో టిటిడిలోని పురాతన ఆలయాల మరమ్మతుకు ఆమోదించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీవారి ఆలయ ఉద్యోగి నరసింహన్ కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని తీర్మానించారు.

**టిటిడి మాజీ బోర్డు సభ్యులు పదేపదే రావొద్దు**

టిటిడి ధర్మకర్తల మండలి మాజీ సభ్యులకు సంవత్సరంలో కొన్నిసార్లు మాత్రమే వారి కుటుంబ సభ్యులతో (భార్యా పిల్లలతో) శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశాన్ని బోర్డు కల్పించిందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, కుటుంబ సభ్యులతో కాకుండా ఇతరులను వెంట బెట్టుకుని పదేపదే తిరుమలకు రావడం మంచి పద్ధతి కాదన్నారు. మాజీ బోర్డు సభ్యుని హోదాలో కేవలం కుటుంబ సభ్యులతో మాత్రమే శ్రీవారి దర్శనానికి రావాలే తప్ప, ఇతరులను వెంట బెట్టుకుని వస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ శ్రీవారి దర్శనానికి అనుమతించేది లేదన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం జరిగింది. డయల్ యువర్ కమిషనర్‌కు 17, స్పందనకు 18 ఫిర్యాదులు అందాయి. చంద్రశేఖర్‌రెడ్డి కాలనీలో పాములు వస్తున్నాయని, సుందరయ్యనగర్ నాలుగో క్రాస్‌లో రోడ్డు తవ్వి పూడ్చలేదని, లీలామహల్ డివైడర్‌లో మొక్కలు ఎండిపోతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్ పాల్గొన్నారు.

# తిరుపతి అభివృద్ధిని అడ్డుకున్న బిజెపి

## ఏ మొహం పెట్టుకుని ఓటడగాలి..?



**టిడిపి శ్రేణుల్లో తర్జనభర్జన**
**మైనార్టీలు, దళితుల్లో అభద్రత**
**ఒపిఎస్ రద్దుపై ఉద్యోగులు గుర్రు**

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

తిరుపతి అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకున్న బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకోవడం ఆ పార్టీ క్యాడర్ మల్లగుల్లాలు పడుతోంది. ఏ మొహం పెట్టుకుని తిరుపతి ఓటర్లను ఓటు అడగాలంటూ వాపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎలా ఉన్నా తిరుపతిలో బిజెపి పట్ల వ్యతిరేకత నెలకొంది. తిరుపతిని అభివృద్ధి చేయాలని చూసిన ప్రతిసారీ అడ్డుపుల్ల వేస్తూ వచ్చింది. ఇదిలా ఉండగా మైనార్టీలు, దళితులు, క్రిష్టియన్లలో అభద్రతా భావం నెలకొంది. ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుపతిలో బిజెపికి ఓటేస్తే తమ పరిస్థితి ఏంటన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. టిడిపి, జనసేన పొత్తు బాగుంది కానీ, బిజెపితో పొత్తు మాత్రం వారిని కలవరపెడుతోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేనకు 1.7 శాతం ఓట్లు పడ్డాయి. బిజెపికి 0.5 శాతం ఓట్లు కూడా రాలేదు. బిజెపి పట్ల ఉద్యోగ కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ఒపిఎస్ రద్దు కారణంగా కేంద్రంపై వీరు ఇప్పటికీ గుర్రుమనే ఉన్నారు.

**అడుగడుగునా బిజెపి అడ్డంకులే..**

తిరుపతి అభివృద్ధి విషయంలో బిజెపి ఎన్నో రకాలుగా అభివృద్ధిని అడ్డుకుంది. తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో గరుడ వారధి నిర్మాణానికి టిటిడి నిధులు ఇవ్వకుండా బిజెపి నేతలు కోర్టులో స్టే వేసి అడ్డుకుంది. తిరుపతి పారిశుధ్యం నిర్వహణ కోసం తిరుమలకు వచ్చే యాత్రికులకు శుభ్రంగా ఉండేందుకు టిటిడి నిధులను ఒక్క శాతం ఇవ్వాలని పాలకమండలి తీర్మానం చేసింది. దీన్నీ బిజెపి కోర్టులో స్టే తెచ్చి అడ్డుకుంది. పార్వేటి మండపాన్ని కూల్చివేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేసింది. టిటిడి ఉద్యోగులకు ఇస్తున్న ఇళ్లస్థలాలు భూమి చదును విషయంలోనూ టిటిడి నిధులు వినియోగించరాదని అడ్డుకుంది. ఈ ఐదేళ్లలో తిరుపతి అభివృద్ధిని బిజెపి అడుగడుగునా అడ్డుకోవడమే తప్ప, ఒక్కటైనా కేంద్రంతో కొట్లాడి అభివృద్ధికి సహకరించిన పాపాన పోలేదు.

**కార్యకర్తల్లో తర్జనభర్జన**

బిజెపితో పొత్తు ఎంత మేరకు లాభం చేకూరుతుందని టిడిపి శ్రేణులు తర్జన భర్జన పడుతున్నాయి. ఇప్పటికే టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కుప్పం నుంచి చంద్రబాబునాయుడు, చిత్తూరు గురజాల జగన్మోహన్, పలమనేరు అమరనాథరెడ్డి, నగరి గాలి భానుప్రకాష్, తంబళ్లపల్లి ప్రకటించారు. తిరుపతి అసెంబ్లీ జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో, ఎంపి సీటు పొత్తులో భాగంగా బిజెపికి ఇవ్వనున్నారు. చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో ముస్లీంలు, దళితులు ఎక్కువమంది ఉన్నారు. రాజంపేట ఎంపి సీటు బిజెపికి ఇస్తే మదనపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ముస్లీంలు ఎక్కువగా ఉన్నారు. ముస్లీం మైనార్టీ ఓట్లు కాంగ్రెస్, వైసిపిలకే లాభిస్తుందనేది వారి అంచనా. మణిపూర్‌లో క్రిష్టియన్లపై దారుణ మారణకాండను నిరసిస్తూ ముస్లీం, క్రైస్తవ సంఘాలు ఖండిస్తూ బిజెపికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. విభజన హామీలు అమలు చేయకపోవడంతో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ లేదు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించకపోగా నల్లచట్టాలను అమలు చేస్తోంది. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి. వీటన్నింటిపై వామపక్షాలు అఖిలపక్షంతో కలిసి అనేకమార్లు నిరసనలు తెలపడమే కాకుండా, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాయి. ఇన్నాళ్లూ కేంద్రంపై గుర్రుమన్న టిడిపి ఓటు విషయంలో పొత్తు కారణంగా ఏం చేస్తుందో మరి.

## సీనియర్ ఇంటర్ పరీక్షకు 565మంది గైర్హాజర్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

సోమవారం జిల్లాలో జరిగిన సీనియర్ ఇంటర్ పరీక్షలకు 565 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఒ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం మ్యాథ్స్ 2బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు నిర్వహించారు. 87 సెంటర్ల ద్వారా జరిగిన పరీక్షలకు 25476 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 24911 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ కోర్సులో 24383 మందికి విద్యార్థులకు 23860 మంది హాజరయ్యారు. 483 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల ద్వారా జరిగిన ఒకేషనల్ కోర్సులకు 1133 మంది విద్యార్థులకు గాను 1051 మంది హాజరయ్యారు. 82 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

## 14, 15 తేదీల్లో తేనె టీగల పెంపకంపై రాష్ట్రస్థాయి సదస్సు

**ప్రజాశక్తి - క్యాంపస్**

జాతీయ తేనె టీగల పెంపకం, తేనె మిషన్ పథకం లో భాగంగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ సంయుక్తంగా విద్యార్థులకు, గ్రామీణ యువతకు, మహిళలకు, ఔత్సాహికులకు తేనె టీగల పెంపకం పై రెండు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 14 మరియు 15 తేదీలలో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డా.సి.రమణ తెలిపారు. తేనెటీగల పెంపకం పరిశ్రమను ప్రోత్సహించడం కొరకు నిర్వహిస్తున్న ఈ సెమినార్ లో తేనె టీగల పెంపకంలో మెళకువలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అవకాశాలు, వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి విషయాలపై అవగాహన కల్పించడమే గాక తేనెటీగల పెంపకంలో నిష్ణాతులైన రైతుల అనుభవాలు పంచుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.



# శ్రీరామలో ప్రాంగణ ఎంపికలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్లోబల్ లాజిక్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు చేపట్టింది. ఈ ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు 61 మంది ఎంపికైనట్లు కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్ దీప్తి, కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నూతన ఆలోచనలకు కళాశాలలో మరింత నైపుణ్యతను జోడించడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గ్లోబల్ లాజిక్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన 61 మందికి వార్షిక వేతనం 2.4 నుండి 3.5 లక్షల రూపాయలుగా ఇవ్వనున్నారన్నారు. అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ప్లేస్మెంట్ అధికారి టి.విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలుగుగంగ లీకేజీతో రోడ్డు నిర్మాణానికి ఆటంకం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేటు వరకు నిర్మించ తలపెట్టిన 80 అడుగుల రోడ్డు మార్గానికి తెలుగు గంగ పైపు లీకేజీలు అడ్డుగా మారాయి. నెల రోజులుగా రోడ్డు నిర్మించడానికి సదరు గుత్తేదారు ఈ మార్గాన్ని చదును చేస్తుంటే లీకేజీలతో పనులు ఆలస్యం అవుతున్నట్టుగా తెలుస్తోంది. పూర్తిస్థాయిలో తెలుగుగంగా పైపు లీకేజీలను అరికడితే కానీ పనులు ముందుకు సాగే పరిస్థితి కనబడటం లేదు. మంగళం తెలుగుగంగ పంప్ హౌస్ నుండి రేణిగుంటకు వెళ్లే పైపులైను అధిక లీకేజీలు ఉందని, తెలుగుగంగ అధికారులు వెంటనే స్పందించి లీకేజీలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


తెలుగుగంగ పైపు లీకేజీతో శెట్టిపల్లి మార్గంలో నీటి కుంటలా ఏర్పడిన ప్రాంతం

## విలేకరి బాలును పరామర్శించిన కందారపు మురళి



విలేకరి బాలసుబ్రహ్మణ్యం పరామర్శిస్తున్న కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుమల ప్రజాశక్తి విలేకరి బాలుసుబ్రహ్మణ్యం ఇటీవల గుండె నొప్పితో స్విమ్స్ లో వైద్యం తీసుకున్నారు. డిశ్చార్జ్ అయింటిలో విశ్రాంతి తీసుకుంటున్న బాల సుబ్రహ్మణ్యంను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

## పాఠశాలకు బెంచీలు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోటరీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరంకి బెంచీలు పంపిణీ చేశారు. దాత శ్రీలక్ష్మి, పిఎం రావు, బాల సుబ్రహ్మణ్యం, ఎస్ఎల్ఎన్ బాబు ఆర్థిక సాయంతో ఈ బెంచీలు అందించారు. పాఠశాల కమిటీ అధ్యక్షులు మురళి రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సనత్ కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, గిరిబాబు, నాగరాజా రెడ్డి, సిద్ధారెడ్డి, రవిచంద్ర, ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ప్రాచీన్ పికెల్స్' దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని గడియారం స్తంభం ప్రాంతంలో ద్రౌపది కాంప్లెక్స్ దుకాణ సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ పికెల్స్ దుకాణాన్ని స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ సోమవారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల మాంసాహార, శాకాహార ఊరగాయలను ఆమె పరిశీలించి నిర్వాహకులను ముచ్చటించారు. ఈ సందర్భంగా దేవసేనమ్మ మాట్లాడుతూ ఎక్కడో భీమవరం, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో దొరికే మాంసాహార ఊరగాయలను ప్రస్తుతం గూడూరులో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. చాలా రకాల ఊరగాయలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ షబానా, ఖాజా రంహతుల్లా, ఆశాబేగం, నాయకులు సురేష్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- రేణిగుంట: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ కృష్ణ మంజరి సమక్షంలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలు రేణిగుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రేణిగుంట , ఏర్పేడు మండలాల, అంగన్వాడీ టీచర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ కృష్ణ మంజరి మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టే లేదని, సమానత్వం, స్వేచ్ఛ ఎదుర్కొనే శక్తి, ఆడ పిల్లలను చదువులలో మంచి డాక్టర్, కలెక్టర్, ఇంకా పై ఎత్తుకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ధనమ్మ మాట్లాడుతూ ప్రతి అక్కా, చెల్లెల్లు ఈ సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఆడ పిల్లలు బాల్య వివాహాలు చేసుకుంటే ఎలాంటి అనర్థాలు వస్తాయో వివరించారు. ఈ కార్యక్రమం లో సూపరు వైజర్లు, వర్కర్స్ పాల్గొన్నారు. పోషణ పక్వాడ ర్యాలీ ఈనెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరుగును న్యాయని అందులో భాగంగా మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

## అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - రేణిగుంట/ఏర్పేడు: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి, ఎడ్పీటీసి వి ఢిల్లీ రాణి సోమవారం ప్రారంభించారు. మండలంలోని కెకెవి పురం, సొరకాయలపాలెం సచివాలయ పరిధిలో ప్రభుత్వ, తుడా నిధులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు మరి కొన్ని అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కేకేపురం సొరకాయల పాలెం సచివాలయ పరిధిలో 32 పనులకు మూడు కోట్ల 9 లక్షలు నిధులను ఖర్చు చేసినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో తుడా నిధులతో సిసి రోడ్లు, ఆర్వో ప్లాంట్లు, సమావేశ మందిరాలు, కర్మ క్రియ భవనాలను ఏర్పాటు చేసిన ఘనత మన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు ఢిల్లీ రాణి, మండల పార్టీ ఇన్చార్జి సుధాకర్ రెడ్డి, భాను కుమార్ రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాలతో కవాతు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరు లో సోమవారం సాయంత్రం పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గానికి మొత్తం 3 కంపెనీ (ఒక కంపెనీ అనగా 100 మంది) సాయుధ బలగాలు ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు. అందులో ఒక కంపెనీ కేంద్ర బలగాలతో సోమవారం సాయంత్రం పిచ్చాటూరు టౌన్ తో పాటు నీరువాయి గ్రామం, హరిజనవాడలో కవాతు నిర్వహించామన్నారు. ఈ వారంలో ఇంకొన్ని, పోల్లింగు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కవాతు లో ట్రైనీ డీఎస్పీ సింధు, సిఐ భాస్కర్ నాయక్, పిచ్చాటూరు, కేవీబీ పురం ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సయ్యద్ మహమ్మద్ షరీఫ్, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

## వైసిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా జ్యోతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి జిల్లా వైసిపి మహిళా ఉపాధ్యక్షురాలుగా పి జ్యోతిని నియమిస్తూ నియామక పత్రాన్ని మండల వైసిపి మండల ఎన్నికల ఇన్ఛార్జి ఎం సుధాకర్ రెడ్డి సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి, జెడ్పిటిసి ఢిల్లీ రాణి మండల వైసిపి నాయకులు భాస్కర్ యాదవ్, భాను కుమార్ రెడ్డిలు జ్యోతిని దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు.

## మంగళంలో అడవికి నిప్పు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్ సమీపంలోని అడవికి నిప్పు అంటుకుంది. సోమవారం సాయంత్రం అడవికి నిప్పు అంటుకోవడంతో అడవి కొన్ని హెక్టార్ల వరకు కాలిపోయినట్లుగా తెలుస్తోంది. అడవికి నిప్పు రాజుకోవడంతో సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఏర్పడిన నిప్పును ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ఆకతాయిల పనా? లేక కార్చిచ్చు ఏర్పడిందా? అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజల అభ్యర్థన మేరకే అభివృద్ధి పనులు: వీరమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శెట్టిపల్లి పంచాయతీ నుండి తిరుపతి నగరపాలక సంస్థలో విలీనమైన హౌసింగ్ బోర్డ్ మినహా ఉన్న మూడు హౌసింగ్ బోర్డుతో ఏర్పడిన నూతన మంగళం పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని సర్పంచ్ వీరమ్మ తెలిపారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయంలోని వార్డు మెంబర్ల సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ మూడు సీసీ రోడ్లు, రెండు కొత్త బోర్లు, మూడు చెత్త కుండీల నిర్మాణం చేయడానికి పాలకవర్గం ఆమోదం తెలిపిందన్నారు. గతంలో జరిగిన అభివృద్ధి పనులపై వచ్చిన విమర్శలను మీడియా ప్రశ్నించగా కార్యదర్శి విజయభాస్కర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి రామకృష్ణ, వార్డు మెంబర్లు మునివేణి, వాసు, వేమూరి తనూజ, మంగమ్మ, బాలసుబ్రహ్మణ్యం, మునిలక్ష్మి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరింది: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -దొరవారిసత్రం : నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరిందని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన దొరవారిసత్రం మండలంలోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నివేశ స్థలాల పట్టాదారులకు రిజిస్ట్రేషన్ హక్కు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోరుకున్న ముఖ్యమంత్రి మళ్లీ గెలిపించుకుంటే పేదల నిర్మాణాలకు మరెన్నో బృహత్తర కార్యక్రమాలు అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ దేవస్థానం బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఉప మండల అధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, మండల తహశీల్దార్ పాల్గొన్నారు.

## చిన్న పిల్లల మరణాల నివారణకు చర్యలు: సీడీపీఓ

ప్రజాశక్తి -బాలాయపల్లి : ప్రభుత్వం మండలంలో పదేళ్లలోపు పిల్లల మరణాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని లక్ష్మమ్మ సీడీపీఓ సంపత్ దేవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకటరెడ్డి పల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కార్యాలయంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలు, విద్యార్థుల మరణాల రేటు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రిమేషన్ షెడ్ను ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పురపాలక సంఘం పరిధిలోని శ్మశాన వాటికలో ఒక కోటి 57 లక్షల రూపాయలతో నిర్మించిన క్రిమేషన్ షెడ్ను, 25 లక్షల రూపాయలతో నిర్మించిన ఉత్తర క్రియల భవనాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్.కె. రోజా సోమవారం ప్రారంభించారు. అనంతరం శివుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మునిసిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్లు డి జయ ప్రకాష్, డి శంకర్, కౌన్సిలర్లు నరసింహారావు, ఏకాంబరం, ఏడికె పవన్ కుమార్, ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టిసి బస్సుల కొరత

- ఫుట్ బోర్డుపై ప్రయాణం
- నిత్యం ప్రమాదకర స్థితిలో రాకపోకలు
- విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలకు నిత్యం 50 నుంచి 60 వరకు ఉపాధ్యా యులు, వివిధ ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లేవారు, విద్యార్థులు వందల సంఖ్యలో వుండడంతో ఆర్టిసి బస్సులు తగిన సంఖ్యలో లేక వారు ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన సమయానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు చేరుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు ఉన్న ఒకటి, రెండు బస్సుల్లోనే స్కూలుకు వెళ్లి, సాయంత్రం ఫుట్‌బోర్డు పైనే ప్రయాణించి ఇంటికి చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆర్టిసి అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులను, ఉపాధ్యాయులు, ఉద్యోగులను దృష్టిలో వుంచుకుని తగిన బస్సు సర్వీసులు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాల్సి వుంది.



బుచ్చినాయుడు కండ్రికకు సత్యవేడు, శ్రీకాళహస్తి , సూళ్లూరు పేట, తిరుపతి డిపోల నుంచి బస్సులు వస్తున్నాయి. ఇవే కాకుండా చెన్నై నుండి కూడా వస్తాయి. ఉదయం స్కూలు ప్రారంభ సమయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటలకు, సాయంత్రం వదిలే సమయం నాలుగు నుంచి నాలుగున్నర గంటల మధ్య ఒక్క బస్సు మాత్రమే వస్తోంది. విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండడంతో వారు ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తోంది. గతంలో ఎన్నోసార్లు డిపో మేనేజర్లకు విన్నవించినా ఫలితం శూన్యమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలు వదిలే సమయానికి ప్రత్యేకంగా ఆర్టిసి బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరు తు న్నారు.

### ప్రమాదకర స్థితిలో ప్రయాణం

బుచ్చినాయుడు కండ్రికకు వచ్చే టీచర్స్ 50 నుండి 60 మందికి పైగానే ఉన్నారు. మిగిలిన కార్యాల యాల్లోనూ అధిక సంఖ్యలో ఉండడంతో విద్యార్థులకు ఇబ్బంది కరంగా ఉంటోంది. బస్సు టాప్‌పై, ఫుట్ బోర్డుపై ప్రయాణించాల్సి వస్తోంది. బుచ్చినాయుడు కండ్రిగ లో ప్రైవేటు స్కూళ్లకు సుమారు 350 మంది, ప్రభుత్వ పాఠశాలలకు 400 మంది వరకు విద్యార్థులు ఆర్టిసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మొత్తం 750 మంది విద్యార్థుల వరకు ఆర్టిసి బస్సులను ఆశ్రయి స్తున్నారు. వారందరికీ ఉదయం పాఠశాలలు ప్రారంభ సమయంలోనూ, సాయంత్రం స్కూళ్లు వదిలిన సమయంలోనూ తగినన్ని బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తే ప్రమాదకర పరిస్థితిని అరికట్టవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఆర్టిసి అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం వుంది.



ఆచార్య రజినికి పదవీ కాలం పెంపు పత్రానికి అందిస్తున్న విసి భారతి

## ఎన్ రజిని పదవీ కాలం పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కుల సజీవులు ఆచార్య ఎన్ రజిని పదవీ కాలాన్ని 2023, జనవరి 5 నుంచి మూడు సంవత్సరాల కాలానికి పొడిగించినట్లు ఉపకులపతి ఆచార్య డి భారతి వెల్లడించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య భారతి మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో వర్సిటీలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలలో, పరిపాలనలో తనదైన శైలిలో, చాకచక్యంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కొనియాడారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని కాకుండా దేశంలోనే నాక్ కమిటీ చే ఏ ప్లస్ గ్రేడ్ ను సాధించి దేశస్థాయిలోనే గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలతో పోటీ పడుతూ అక్కడ మీకు అంశాలలో పరీక్షల నిర్వహణ ఫలితాల విడుదలలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీని ఎల్లప్పుడూ ముందుకు నడిపించడానికి ఆమె కృషి శ్లాఘనీయమన్నారు. మహిళా వర్సిటీకి దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపతి మురుము రావడానికి కారణం వర్సిటీ లోని అభివృద్ధి, అకడమీక్, బోధన, పరిశోధన అంశాలే ముఖ్య కారణం అన్నారు. వర్సిటీకి ఆమె సేవలు మరికొంత కాలం అవసరమని భావించి ఆమె పదవి కాలాన్ని ఇప్పటినుంచి మరో రెండు సంవత్సరాలు పొడిగించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, డీన్లు, ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు, పరిశోధకులు, అకాడమిక్ కన్సల్టెంట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజినీకి శుభాకాంక్షలు తెలిపారు.

# దళితులకు ప్రభుత్వ భూములు పంచాలి

- కబ్జా చేస్తున్న స్థానికేతరులపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం ఆధ్వర్యంలో దళితుల ధర్నా

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కుక్కంబాకం దళితులకు ప్రభుత్వ భూములు పంచాలని, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న స్థానికేతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళితులకు భూముల పంచాలని కోరుతూ సూళ్లూరుపేట ఆర్‌డివో కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో దళితులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబాకం రెవెన్యూలోని సర్వే నంబర్ 81లో 82 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరుపతికి చెందిన విజయుల నాయుడు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడన్నారు. ఈ భూమిలో పేదలు సుమారు 20 సంవత్సరాలుగా చెట్లు తొలగించి సాగు చేసుకుంటున్నా పట్టాలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. సాగులో ఉన్న దళితులపై అగ్రకులాల చెందిన విజయులు నాయుడు దళిత మహిళలపై దౌర్జన్యంగా దాడి చేస్తూ కులం పేరుతో దూషించడం అన్యాయమని పేర్కొన్నారు. కబ్జాదారులకు, స్థానికేతరులకు స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. తక్షణమే అధికారులు దళితులపై దాడి చేసిన విజయాలు నాయుడుని ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అరెస్టు చేయాలని, సర్వేనెంబర్ 81 లోని 82 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక దళితులకు పట్టాలు ఇవ్వాలని ఆర్డిఓ ఆఫీసులోని ఏవోకి వినతిపత్రం అందించారు. స్పందించిన ఏఓ మాట్లాడుతూ వెంటనే విచారణ జరిపి పేదలకు ఈ భూమి చెందేలా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట సిపిఎం నాయకులు అల్లయ్య, సాంబయ్య, లక్ష్మయ్య, సిపిఎం ,సత్యవేడు నియోజకవర్గ నాయకులు రమేష్, నాగరాజు, బుచ్చినాయుడు కండ్రిగ మండల కార్యదర్శి రమణయ్య, యువజన సంఘం నాయకుడు మురళి, గ్రామ నాయకుడు జెకె రమణయ్య, కృష్ణమ్మ, శంకరమ్మ, అనిల్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న కుక్కంబాకం దళితులు

## 14న రైతాంగ పోరాటాన్ని జయప్రదం చేయండి

### రౌండు టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 14వ తేదీ చేపట్టనున్న రైతాంగ పోరాటాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ పిలుపునిచ్చారు. 540 రైతు సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రంలో రైతు సంఘాల సమైక్య కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపులో భాగంగా పుత్తూరు జిల్లా సమితి సభ్యులు డి మహేష్ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో విస్తృత స్థాయిలో కరపత్రాలు పంపిణీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. మోడీ తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో పెద్ద ఎత్తున రైతాంగం నిర్వహించిన పోరాట ఫలితంగా బిజెపి ప్రభుత్వం వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటుందని మోడీ ప్రకటించి రాత పూర్వక హామీ ఇచ్చారని, ఆ తర్వాత నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. 540 రైతు సంఘాల సంయుక్త కిషాన్ మోర్చా పలు మార్లు కోరినా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదన్నారు. దీనిపై మరో మారు పోరాటానికి తరలడంతో రైతాంగాన్ని అడ్డుకోవడం దుర్మార్గ మన్నారు. రైతాంగం పట్ల బిజెపి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోం దన్నారు. రైతాంగ పోరాటాన్ని కార్మిక కర్షక ఐక్యతలో విజయవంతం చేయాలన్నారు. రానున్న ఎన్నికలలో బిజెపిని, నరేంద్ర మోడీని వారికి సపోర్ట్ చేసే పార్టీలను ఓడించి నప్పుడే రైతాంగానికి కార్మిక వర్గానికి పేద ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. ఇందుకోసం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయా లన్నారు. 14వ తేదీ అన్ని మండల కేంద్రాలలో, నియోజక వర్గ కేంద్రాలలో ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని రైతులు, కార్మికులు, పేద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు విజయ్, రమేష్, వెంకటేష్, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబు, నాయకులు కృష్ణారెడ్డి, వర్మ, ఆకాష్, , ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

## వైభవంగా ఆది దంపతుల కల్యాణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వేకువ జామున ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చరణలు చేస్తూ ఆది దంపతుల కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. శివపార్వతుల కల్యాణం వీక్షించడానికి పట్టణ వాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వారు వేలాదిగా తరలి వచ్చారు. కల్యాణం వీక్షించడానికి వచ్చిన భక్తజనంతో నగరివీధి, నెహ్రూవీధి నిండి పోయాయి. కాగా ఆది దంపతుల కల్యాణం సందర్భంగా వివాహం చేసుకున్న వారికి ఆలయం తరపున మంగళ సూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. పార్వతీదేవికి మాంగల్యధారణ చేసిన ఘడియలోనే ఈ జంటలు కూడా మాంగల్య ధారణ కార్యక్రమం పూర్తి చేశారు. ఆది దంపతుల కల్యాణం సందర్భంగా ఈ ఏడాది 46 జంటలు వివాహం చేసుకున్నాయి



వీధుల్లో విహరిస్తున్న శివ పార్వతులు

## మహిళా వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిఎస్టీ – క్యూరి–ఏఐ సెంటర్ తరుపున "ఇన్నోవాషన్స్ ఇన్ అడ్వాన్స్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ ఆగమెంటెడ్ రియాలిటీ' అనే అంశం పై అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపిఎస్సిహెచ్ఈ చైర్మన్ ఆచార్య కె. హేమచంద్ర రెడ్డి మాట్లాడుతూ ఇన్నోవాషన్స్ ఇన్ ఏఐ గురించి వివరించారు. ఏపీలో ఏఐ సెంటర్ విస్తరించిన మొదటి యూనివర్సిటీ మహిళ యూనివర్సిటీ అని పొగిడారు. ఏఐ ఎక్కువ వాడకం లోకి రావటం వల్ల ఉన్న ఉద్యోగ అవకాశాలు తగ్గుతాయని కొత్త ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. భవిష్యత్తులో విద్యార్థులు ఎదురుకునే ఇలాంటి సమస్యలను గుర్తుపెట్టుకుని వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత ఇనోవాటివ్ ఏఐ కాన్సెప్ట్ మీద డిఎస్టీ – క్యూరి–ఏఐ సెంటర్ వారు అంతర్జాతీయ సదస్సు నిర్వహిచడం ప్రశంసనీయం అన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ఆచార్య డి. భారతి అధ్యక్షత వహించారు. వారు ఇన్నోవేటివ్ ఏఐ పై మాట్లాడుతూ ఇలాంటి సదస్సు వల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు వారి ఆలోచనలను షేర్ చేసుకోవడానికి ఉపయోగపడ తాయన్నారు. పిఎస్సిహెచ్ఈ వైస్ ఛైర్ పర్సన్ ఆచార్య పి. ఉమామహేశ్వరి దేవి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని గౌరవ అతిథులుగా వ్యవహరించారు. ఎపిఎస్సిహెచ్ఈ వైస్ ఛైర్ పర్సన్ ఆచార్య పి. ఉమామహేశ్వరి దేవి ఇంపాక్ట్ ఆఫ్ ఏఐ ఇన్ ఎడ్యుకేషన్ సిస్టమ్ అండ్ హెల్తకేర్ గురించి విశ్లేషించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని ఏఐ అండ్ ఏ ఆర్ అనుసందించి ఎలా ఇన్నోవేటివ్ అప్లికేషన్ తయారు చేయవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్టీ – క్యూరి – ఏ ఐ సెంటర్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. జ్యోతి, డాక్టర్ రత్నగిరి పోలవరపు, ప్రొఫెసర్ ఆచార్య అలోక్ పాండే, డాక్టర్ హసీయా కరీమా బింటీ, కన్వీనర్ లు ఆచార్య ఆర్. ఉష, డా. పి. భార్గవి, వర్సిటీ డీన్స్, డైరెక్టర్స్, అధ్యాపకులు, పరిశోధక, విద్యార్థినులు పాల్గొన్నారు.



అతిథులకు జ్ఞాపికలు అందిస్తున్న విసి భారతి

## పేదల పక్షపాతి సీఎం జగన్: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పేదల పక్షపాతి సీఎం జగన్ అని ఎమ్మెల్సీ మురళీధర్ పేర్కొన్నారు. గూడూరు సాయినగర్‌లోని సీఆర్ రెడ్డి కల్యాణ మండపంలో వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త మేరిగ మురళీధర్, స్వచ్ఛ ఆంధ్ర ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. వారికి స్థానిక మహిళలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడ లబ్ధిదారులు ఏర్పాటు స్టాల్స్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్ర పటానికి వారు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నార న్నా రు. పొన కా దేవసేనమ్మ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక వ్యక్తి సీఎం జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వైకాపా మండల అధ్యక్షుడు మల్లు విజయకుమార్ రెడ్డి, ఎంపిపి గురవయ్య, జెడ్పీటీసీ యామిని, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మహేంద్రరెడ్డి, సురేష్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.



వైఎస్ఆర్ చేయూత చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్

# అధికారులకు మినహాయింపు లేదు..

### గైర్హాజరైన వారిపై మండల సమావేశంలో ఎంపిపి ధ్వజం

ప్రజాశక్తి -రామచంద్రపురం: సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ హాజరు కావాలని మినహాయింపు లేదని గైర్హాజరైన వారిపై ఎంపిపి ధ్వజమెత్తారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశానికి మండల, డివిజనల్ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. మండల మీట్ కు కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి స్రవంతి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను వివరించారు. ఇక్రాప్ బుకింగ్, రైతు భరోసా, ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు మార్కండేయుల నాయుడు, జయవేలు మనబడి, నాడు నేడు పథకం ప్రగతిని, విద్యా కానుక జగనన్న గోరుముద్ద విద్యా దీవెన అవఒడి పథకాలకు సంబంధించిన వివరాలను సభ ముందుంచారు. అంగన్వాడీ కేంద్రాల పౌష్టికాహార వివరాలను వినిపించారు. ఉపాధి హామీ పనులను ఏపీఓ హంస వేణి తెలిపారు. ఆర్టీసీ సంస్థ ప్రతినిధిగా మార్పరీరి ఈశ్వర్ నాయుడు మాట్లాడుతూ కొత్త బస్సులు రాగానే అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న వివరాలను వసతి గృహం సంక్షేమ అధికారి నాయక్ తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి సునీల్ కుమార్, పంచాయతీ విస్తరణాధికారి వారి సమస్యలు వివరించారు. కొన్ని శాఖల మండల అధికారులు రాకపోవడంతో తమ సమస్యల గురించి చెప్పుకోలేక పోయామని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దారు ఉషారాణి మాట్లాడుతూ మండలంలో అర్హులైన అందరికీ ఇంటి పట్టాలు మంజూ రు చేశామని ఇంకా కొంతమందికి మంజూరు కావలసినవి ఉన్నాయని తెలిపారు ప్రస్తుతం ఎన్నికల విషయాలపై నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఎంపీడీవో ప్రత్యూష మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధిలో పాలుపంచు కోవాలని కోరారు. జడ్పిటిసి ఢిల్లీ రాణి భాను కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ లావణ్య, ఎంపీటీసీలు చంద్రశేఖర్ రెడ్డి, మునీంద్ర బాబు, జ్ఞానమ్మ, మంజుల, కృష్ణవేణి, ఎద్దుల రాజేష్, సర్పంచులు హిమాల్ రెడ్డి, మురగయ్య, శ్రావ్య, వేణుగోపాల్ నాయుడు, భారతీ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి బ్రహ్మానందరెడ్డి

## 'జగనన్న పాల వెల్లువ' కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు : అమూల్ సంస్థతో ప్రభుత్వం రైతు భాగస్వామ్యంలో భాగంగా 'జగనన్న పాలవెల్లువ' పాల సేకరణ కేంద్రాలను కలెక్టర్ జి లక్ష్మీశ మండలంలోని నల్లపురెడ్డి గారి పల్లి చటేవారి పాలెం , నెల్లుట్ల వారిపల్లి , చిన్నగొట్టిగల్లులో సోమవారం ప్రారంభించారు. ప్రైవేట్ డెయిరీల దోపిడి నుండి పాడి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం జగనన్న పాల వెల్లువను ప్రారంభించిందన్నారు. దీని ద్వారా రైతులకు పాలకు మంచి ధర ఇస్తారన్నారు. ఆమూల్ సహకార సంస్థతో పాడి రైతులు భాగస్వామ్యం వున్నందువల్ల వచ్చిన లాభాలను కూడా రైతులకు తిరిగి చెల్లిస్తారని పేర్కొన్నారు. రైతులకు ఆదుకునేందుకు సబ్సిడీ రుణం, దాణా, యంత్ర పరికరాలు అందిస్తారని తెలిపారు. ప్రైవేట్ డెయిరీల కన్నా ఎక్కువ ధర 'జగనన్న పాల వెల్లువ'లో పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి బాలం యుగంధర్ రెడ్డి, ఎంపిడిఒ దేవేందర్ బాబు, జెట్పిటిసి స్వరూప, సర్పంచ్‌లు మనోహర్, శశి ప్రియ, నాయకులు కొండా రెడ్డి, మహేందర్ రెడ్డి, సిబ్బంది మదన మెహన్ రాజు, వెంకటేశ్వర రెడ్డి వాలంటీర్లు వెంట్రమణ, బాషా మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చెందాలంటే టిడిపిని గెలిపించాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నాని సోదరి ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీలోని ఊట్లవారిపల్లి,నన్నూరువారిపల్లి, రామిరెడ్డిగారి ఇల్లు, మేడసానిఇండ్లు, అబ్బా నాయుడు ఇండ్లు లలో టిడిపి నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పాకాల మండల మహిళా అధ్యక్షురాలు చాముండేశ్వరి, నందీశ్వరి మాట్లాడుతూ బాబు భవిష్యత్తుకు గ్యారెంటీలో సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- నారాయణవనం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని పాలమంగళం ఉత్తరం యానా ది కాలనీలో సోమవారం మధ్యాహ్న 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు వ్యాపించి శక్తివేలుకు చెందిన పూరిల్లుపై పడడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు శ్రమతో మంటలు అదుపు చేశారు. అప్పటికే పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటి విలువ 50 వేల రూపాయలు చేస్తుందని అగ్నికి పూర్తిగా ఆహుతైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.ఇంట్లో దాచుకున్న దుస్తులు, వంట సామగ్రి కాలి బూడిదవడంతో ఆ నిరుపేద కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిబూడిదైన పూరిల్లు

## అండగా ఉంటా..!

### సర్వజ్ఞ యాచేంద్ర భరోసా

ప్రజాశక్తి - బాలాయపల్లి : ' మీకు ఏ సమస్య వచ్చినా తమ వంశ పారంపర్యం అండగా ఉంటుందని వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర పేర్కొన్నారు. మండలంలోని కామకూరు గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నాయకులు కూను రామయ్య తమ్ముడు వెంకటేశ్వర్లు కుమారుడు శివ బాబ్జి ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందడంతో వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలన్నారు. 'మీ కుటుంబానికి అండగా ఉంటాం..' అని భరోసా ఇచ్చారు. అనంతరం కూను శివ బాబ్జి చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూను రామయ్య, కూను పరంధామయ్య, కూను శ్రీను, కూను లీలా సాయి, దాసరి ఆశోక్ పాల్గొన్నారు.

## టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ 20వ వార్డు పరిధిలోని నెత్తం హరిజనవాడ కు చెందిన యువత పట్టణ టిడిపి అధ్యక్షుడు జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టిడిపిలో చేరిన వారిలో సతీష్, చిన్నా, దయాకర్, సురేష్, రమేష్, దినేష్, మణికంఠ, వెంకటేష్, అశోక్, అజయ్, ప్రదీప్, యుగంధర్, చరణ్, రాజేష్, బాలముని, తులసి, తదితరులు వున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రగిరి బరిలో బీసీ అభ్యర్థిని నిలుపుతాం: రుద్రగోపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిడిపిలో బీసీల అభ్యున్నతి పేరుకు మాత్రమేనని, క్షేత్రస్థాయిలో ఎవరూ పాటించరని, అందుకే ఈసారి చంద్రగిరి బరిలో బీసీ అభ్యర్థిని నిలుపుతామని గాండ్ల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రుద్రగోపి స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ అని చెబుతూనే సీట్ల కేటాయింపులు మాత్రం బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. బీసీ అభ్యర్థికి చంద్రగిరి నియోజకవర్గంలో అభ్యర్థిగా స్థానం కల్పించాలని పుదీపట్ల సర్పంచి బడి సుధా యాదవ్ కు అవకాశం కల్పించాలని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే పులివర్తి నాని తనను దుర్భాష లాడారా న్నారు. పొత్తులో భాగంగా చిత్తూరు, కడప, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలలో బీసీలకు సీట్ల కేటాయింపు జరగలేదన్నారు. టిడిపిలో చెప్పేదొకటి చేసేదొకటిగా మారి పోయిందన్నారు. చంద్రగిరి నియోజక వర్గంలో లక్షా ముప్పైవేలకు పైగా బీసీల ఓట్లు ఉన్నాయని, ఇన్ని ఓట్లు ఉన్నా బీసీల పట్ల చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం చంద్రగిరి బడిలో బీసీలకు అవకాశం కల్పించాలని, లేని పక్షంలో బీసీ అభ్యర్థిని బరిలో నిలుపుతామని స్పష్టం చేశారు.